సాక్షి
కుమురం భీం
I
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024

కనకరాజుకు
కన్నీటి వీడ్కోలు

గుస్సాడీకి జీవం పోసి.. ఆదివాసీ కళను ప్రపంచానికి చాటిన 'అడవి' బిడ్డ పద్మశ్రీ కనక రాజు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వం అధికారిక లాంచనాలతో నిర్వహించింది. మర్లవాయి బోరుమనగా.. గిరిజనం తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికింది.

వివరాలు IIలో▸



న్యూస్‌రీల్

29న ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 29న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 పుట్‌బాల్, బేస్ బాల్, ఖోఖో, నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలురకు, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు సాఫ్ట్‌బాల్, పుట్‌బాల్ పోటీలు, తెలంగాణ మోడల్ స్కూల్‌లో నెట్‌బాల్, ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7660888226 నంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వంశీకృష్ణను అభినందిస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వంశీకృష్ణ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఇటీవల ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, నవంబర్ 2 నుంచి 4 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో వైస్ ప్రిన్సిపాల్ రహీం, పీడీ శంకర్ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, కోట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

28న బహిరంగ విచారణ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్‌ల విషయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమయం కేటాయించారని, ఆసక్తి గల అభ్యర్థులు విచారణకు హాజరై తమ సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, సూచనలు, ఆక్షేపణలను రూ.20 విలువగల నాన్ జుడీషియల్ బాండ్ పేపర్‌పై ప్రభుత్వ నోటరీ సంతకంతో కూడిన 6 ప్రతులను (5 నకలు ప్రతులు, 1 నిజ ప్రతి) జత చేసి సమర్పించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడాకారులతో అధికారులు, నాయకులు

తిర్యాణి: క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి ఉమ్మడి జిల్లాకు పేరు తేవాలని జిల్లా క్రీడలశాఖ అధికారి మీనారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో జోనల్ స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 14 మందిని జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రెటరీ సాంబశివరావు, ఎంఈవో అంజయ్య, హెచ్ఎం శంకర్, పీడీ గుండం లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మాండ్ల జగదీష్, నాయకులు మడావి గుణవంత్‌రావు, ఆత్రం వినోద్, పీడీలు పెందూర్ సుభాష్, కుర్సెంగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'జేఎంఈటీలకు ప్రమోషన్ ఇవ్వాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న జేఎంఈటీలకు ప్రమోషన్ ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈమేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి గుల్ల బాలాజీ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏడేళ్ల క్రితం రిక్రూట్ అయిన జేఎంఈటీలలో కొందరికి ఓవర్‌మెన్‌లుగా ప్రమోషన్ ఇచ్చారని, ఇంకా ఖాళీలు ఉన్న మిగతావారికి ప్రమోషన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు.

పకడ్బందీగా పత్తి కొనుగోళ్లు!

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లాలో 17 కొనుగోలు కేంద్రాలు
- నవంబర్ మొదటి వారంలో సీసీఐ కొనుగోళ్లు

ఆరేళ్లుగా జిల్లాలో పత్తి కొనుగోళ్ల వివరాలు

ఆర్థిక సంవత్సరం	పత్తి కొనుగోళ్లు క్వింటాళ్లలో	ఆదాయం రూ.కోట్లలో
2018–19	7,32,418	6.83
2019–20	12,192,24	5.38
2020–21	11,50,641	5.81
2021–22	9,00,247	7.20
2022–23	7,96,677	7.61
2023–24	13,60,233	13.47



జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగు మిల్లులో పత్తి (ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కొనుగోళ్ల సీజన్ సమీపిస్తుండడంతో ఇప్పటికే కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ, తూనికలు, కొలతల శాఖ, అగ్నిమాపకశాఖ, రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సంబంధిత శాఖల అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 4,52,000 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది 4,52,348 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వీటిలో 3,30,00 ఎకరాల్లో పత్తి సాగయ్యిందని, 23 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం కొంత పెరిగింది. ఈ ఏడాది ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది సైతం బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ మద్దతు ధర అధికంగా ఉండడంతో రైతులు సీసీఐ వైపే మొగ్గు చూపారు.

కొనుగోళ్లు సజావుగా సాగేనా..?

పత్తి కొనుగోళ్లలో ఏటా తేమ సమస్య తలెత్తుతోంది. శీతాకాలం ప్రారంభం కావడంతో పత్తిలో తేమ శాతం పెరుగుతుంది. సీసీఐ నిబంధనల ప్రకారం తేమశాతం 8 నుంచి 12 శాతం ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తారు. అంతకంటే అధికంగా ఉంటే క్వింటాల్‌కు ఒక పాయింట్ చొప్పున కోత విధిస్తారు. రైతులు పత్తిని ఆరబెట్టి తెస్తేనే మద్దతు ధర లభించే అవకాశాలు ఉన్నాయి. తేమ కొర్రి చూపుతూ కోత విధించడంతో ఏటా రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయితే పత్తి కొనుగోళ్ల, తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బంది కొరత

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆరేళ్లుగా ఇన్‌చార్జి సెక్రెటరీతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం జైనూర్ కార్యదర్శి ఇర్ఫాన్ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో గ్రేడ్ 3 సెక్రెటరీ, సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, వాచ్‌మెన్, అటెండర్ ఒక్కో పోస్టు మంజూరు కాగా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో తాత్కాలిక సిబ్బందితో మొక్కుబడిగా పనులు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు ఏటా పన్నుల రూపంలో కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ ప్రభుత్వం సిబ్బందిని నియమించడంలో మాత్రం నిర్లక్ష్యం వహించడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయానికి సరిపడా సిబ్బంది లేక పోవడంతో ఏటా పత్తి కొనుగోళ్ల సమయంలో నిర్వహణ ఇబ్బందిగా మారింది.

17 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీల పరిధిలో 17 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. అందులోనే పత్తి కొనుగోళ్లు జరిపేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.6,380 మద్దతు ధర ప్రకటించగా ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.7,521 ప్రకటించింది. జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో జిన్నింగ్ మిల్లుల్లో రక్షణ చర్యలతో పాటురైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పత్తి విక్రయించిన రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయనున్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లాకు పత్తి తరలించకుండా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ చేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గత అనుభవాలతో మిల్లుల్లో పత్తి నిల్వ పేరుకుపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. రహదారులను ఆనుకుని మిల్లులు ఉన్నందువల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశాలు ఉండడంతో అధికారులు ఆదిశగాజాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నవంబర్ మొదటి వారంలో..

జిల్లాలోని 17 జిన్నింగ్ మిల్లుల్లో నవంబర్ మొదటి వారంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే జిన్నింగ్ మిల్లుల్లో మిషనరీ మరమ్మతులు చేపట్టడంతో పాటు కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. రైతులు 8 నుంచి 12 శాతంలోపు తేమ ఉన్న పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతుధర పొందాలి.

– అశ్ఫక్ అహ్మద్, జిల్లా మార్కెటింగ్ అధికారి

వెడ్మ రాము ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు



రాము విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

తిర్యాణి: వెడ్మ రాము ఆశయ సాధనకు ప్రతి ఒక్క రూ కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఎదులపహాడ్‌లో నిర్వహించిన వెడ్మ రాము 37వ వర్ధంతి సభకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం కుమురం భీం తో కలిసి వెడ్మ రాము చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఎదులపహాడ్‌లో రాము నిలువెత్తు విగ్రహం ఏర్పాటుతో పాటు స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం తోటి సంఘం నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీలు ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మాండ్ల జగదీష్, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి గుణవంత్‌రావు, ఆత్రం సంతోశ్, దశరథ్, కుర్సింగ బాదిరావు, మడావి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణహిత'లో ముగ్గురు గల్లంతు



బెజ్జూర్ మండలంలోని సోమిని ఎర్ర బండ ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు.

వివరాలు IIలో▸

రూ. కోట్ల విలువైన మందులు చెత్తపాలు



పాడుబడిన క్వార్టర్‌లో లభించిన మందులు

- ఈఎస్ఐ పాడుబడిన క్వార్టర్‌లో నిల్వలు
- ఆర్జేడీ విచారణలో బట్టబయలు



ఈఎస్ఐ ఆస్పత్రిలో విచారిస్తున్న ఆర్జేడీ హేమలత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కార్మిక బీమా ఔషద నిలయం (ఈఎస్ఐ ఆస్పత్రి)లో కార్మికులకు, బీమా లబ్ధిదారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం మందులను పంపిణీ చేయగా వాటిని పక్కదారి పట్టించేందుకు కొందరు ఉద్యోగులు, అధికారులు కుట్రలు పన్ని ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. తాజాగా శనివారం ఈఎస్ఐ ఆస్పత్రి వెనుకభాగంలో పాడుబడిన క్వార్టర్‌లో కోట్ల రూపాయల విలువ గల మందులు బయటపడటం అధికారుల అవినీతి అక్రమాలను బహిర్గతం చేస్తోంది. వివిధ రకాల మందులను కొందరు ఉద్యోగులు క్వార్టర్‌లో సంవత్సరాల నుంచి డంప్ చేయగా 2022 డిసెంబర్ మాసంలో ఆ మందుల కాల పరిమితి ముగిసింది. దీంతో పేద కార్మికులకు, ప్రజలకు ఉపయోగపడకుండా పోయాయి. ధనార్జనే ధ్యేయంగా గుర్తుతెలియని ఉద్యోగులు ఈ మందులను దాచిపెట్టగా, వాటిని తరలించేందుకు సమయం అనుకూలించకపోవడంతో మందుల కాలపరిమితి ముగిసి పనికిరాకుండా పోయాయని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈఎస్ఐ ఆస్పత్రికి చెందిన ఉద్యోగి మురళి మందులను అక్రమంగా రవాణా చేస్తూ వాటిని కరీంనగర్‌లో విక్రయిస్తుండగా, ఉన్నతాధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఈఎస్ఐ ఉన్నతాధికారులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినితో పాటు ఈఎస్ఐ రీజినల్ జాయింట్ డైరెక్టర్ హేమలత విచారణ ప్రారంభించారు. గతంలో కూడా ఈఎస్ఐ ఆస్పత్రిలో అనేక అక్రమాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఔషధాలను ఈఎస్ఐ కాంపౌండ్‌లో నిప్పుపెట్టడం, అక్రమంగా విక్రయాలు జరపడం ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఇక్కడ పరిపాటిగా మారింది. తాజాగా పెద్ద మొత్తంలో ఔషధాలు నిల్వ ఉన్న అంశం బయటపడటంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పుస్తకాలు బాగా చదవాలి



లైబ్రరీని ప్రారంభిస్తున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని పుస్తకాలను బాగా చదవాలని రూమ్ టు రీడ్ సంస్థ జిల్లా అధికారి జెన్నిఫర్ అన్నారు. శనివారం కౌటాల ప్రాథమిక పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. విద్యార్థులు చదివిందుకు అనుకూలంగా ఉండే అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు. మోడల్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు, ప్రధానోపాధ్యాయలు నానాజీ, నారాయణ్‌సింగ్, గణపతి, ఎంఎల్ రాజు, కోఆర్డినేటర్ సంపత్, సిబ్బంది లూలాజీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి 'బాటలు'పడేనా?

- పోరు గ్రామాలకు రూ.6 కోట్లు ప్రకటించిన మంత్రి
- విడుదల కాని నిధులు..
- మంత్రి హామీ అమలుకు నిరీక్షణ
- భీం పోరుగ్రామాల అభివృద్ధి జరిగేనా?



కంకర తేలిన జోడేఘాట్ రోడ్డు



పూరిళ్లతో పాటగూడ గ్రామం

కెరమెరి(ఆసిఫాబాద్): భూమి.. నీరు.. అడవి కోసం పోరాడి అసువులు బాసిన కుమురం భీం పోరాట గ్రామాల అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించిన కుమురం భీం 84వ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జోడేఘాట్‌లోని మ్యూజియంతో పాటు పర్యాటక ప్రాంతం కోసం రూ.6 కోట్ల నిధులు, పోరు గ్రామాల ఆదివాసీలకు 350 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. దీంతో ఆయా గ్రామాల ఆదివాసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటికీ ఆయా గ్రామాలు, ఆదివాసీల అభివృద్ధి పట్టించుకున్న దాఖలాలు లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.25 కోట్లతో కేవలం మ్యూజియం మాత్రమే అభివృద్ధి చేసిందని, పోరు గ్రామాల గురించి ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గడిచిన అర్ధశతాబ్ద కాలానికి పై నుంచి స్థిర నివాసం ఏర్పర్చుకుని జీవితం గడుపుతున్న ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నది నగ్నసత్యం. నాటి నుంచి నేటి వరకు అదే పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్నారు.

పర్యాటకానికి పెద్దపీట..

ఇప్పటికే జోడేఘాట్‌లో రూ.25 కోట్లతో ఆదివాసీ మ్యూజియం, భీం స్మృతివనం, భీం నిలువెత్తు కాంస్య విగ్రహంతో పాటు జోడేఘాట్ నుంచి టోకెన్ మోవాడ్ వరకు 14 కిలో మీటర్ల వరకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే పర్యాటకులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకులకోసం ప్రత్యేకంగా సత్రాలు, హోటళ్లు, మినరల్‌వాటర్ సౌకర్యం కల్పించనుండగా బాబేఝరిలోని వాటర్ ఫాల్‌ను అభివృద్ధి చేయనున్నారు. వానాకాలంలో సుమారు 30 ఫీట్ల ఎత్తు నుంచి జాలువారే నీరు చూపరులకు కనువిందు చేస్తోంది. అయితే ఆ ప్రాంతానికి వెళ్లడానికి ఎలాంటి రహదారి సౌకర్యం లేకపోవడంతో దూరం నుంచి చూసి సంబరపడడమే పర్యాటకుల వంతవుతోంది.

నిధుల మంజూరు ఎప్పుడో?

మంత్రి సీతక్క హామీ ఇచ్చి వారం రోజులకు పైగా కావస్తున్నా ఇప్పటికీ ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నివేదికలు సిద్ధం చేయాలని వర్ధంతి సమావేశంలోనే జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ తరుణంలో స్థానిక అధికారులు పోరు గ్రామాల వివరాలు, జీవన స్థితిగతులు, పక్కాగృహాల వివరాలు సేకరించారు. కానీ ఇంకా రూ.6 కోట్లకు విధివిధానాలు, ఇందిరమ్మ గృహాల మంజూరు లాంటివి ఇంకా ఏమీ జరగలేదు.

నిధులు విడుదల చేయాలి



మంత్రి ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేయాలి. పోరు గ్రామాల ప్రజలు ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం కూడా ఇళ్ల గురించి హామీ ఇవ్వలేదు. కానీ మంత్రి సీతక్క ఇచ్చిన హామీపై ఎంతో నమ్మకంతో ఉన్నారు.

– పెందోర్ రాజేశ్వర్, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్

సమాచారం సేకరించాం



కుమురం భీం పోరు గ్రామాల్లో సమాచారం సేకరించాం. ఆయా గ్రామాల్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి..అనే వివరాలు సేకరించాం. కానీ పోరు గ్రామాలు ఏవన్న విషయంలో కొంత సందిగ్ధం నెలకొంది. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

– ఎండీ.అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

12 గ్రామాలు ఇవే..



జాబేఝరిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు

మండలంలోని పోరు గ్రామాలైన జోడేఘాట్, జోడేఘాట్ కొలాంగూడ, పాట్నాపూర్, శివగూడ, లైన్‌పటార్, చాల్‌బాడి, పాటాగూడ, బాబేఝరి, గోండ్‌గూడ, టోకెన్‌మోవాడ్, పిట్టగూడ, కొలాంగూడ గ్రామాలకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. జోడేఘాట్‌లో గత ప్రభుత్వం ఇచ్చిన 30 డబుల్ బెడ్ రూంలలో మూడు పూర్తి అయ్యాయి. మిగిలిన 27 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని మిద్దెలు కేవలం జోడేఘాట్‌లో కనిపిస్తుండగా మిగిలిన గ్రామాల్లో ఎక్కడా కూడా పక్కా గృహాలు కనిపించవు. పెంకుటిల్లు, రేకులతో కూడిన ఇళ్లు మాత్రమే కనిపిస్తాయి. అవి కూడా ఇరుకు ఇరుకుగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో నిర్మించిన గృహాల్లో రెండేసి, మూడేసి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇటీవల మంత్రి సీతక్క ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమిని: నిర్మల్ జిల్లా గుండంపల్లిలో ఇటీవల జరిగిన అండర్–17 వాలీబాల్ జోనల్ స్థాయి పోటీల్లో కన్నెపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన గడ్డం సాగరిక ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని హెచ్ఎం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శనివారం ఉపాధ్యాయులు సన్మానించారు. పీఈటీ వహీదా బేగం, శ్రీరాములు, మోహన్, జయశ్రీ, అనిత, సరిత ఉన్నారు.

పేకాటస్థావరంపై దాడి

జైపూర్: మండలంలోని ఇందారంశివారులో శివసాయి రైస్ మిల్లు పక్కన నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అదుపులో తీసుకున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.23,230 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడుగురు పరారీ లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో ఉమెన్ పోటీల్లో ప్రథమస్థానం

చెన్నూర్‌రూరల్: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 24న జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో ఉమెన్ పోటీల్లో మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.నాగలక్ష్మి ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. నవంబర్ 15న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో సౌత్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించింది. ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్, అధ్యాపకులు శనివారం నాగలక్ష్మిని అభినందించారు.

కార్గో ఆధ్వర్యంలో హోమ్ డెలివరీ సేవలు

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో ఆధ్వర్యంలో హోం డెలివరీ సేవలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ రీజియన్ కార్గో మేనేజర్ బి.పాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 33 కౌంటర్ల నుంచి ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిళ్లను వినియోగదారులు ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో 91542 98531, నిర్మల్, భైంసా డిపోల పరిధిలో 91542 98547, ఆసిఫాబాద్ డిపోలో 91542 98534, మంచిర్యాల డిపోలో 91542 98541, ఆదిలాబాద్ ఆర్‌ఎం ఆఫీస్ 91542 98553 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

లింగాపూర్: చెట్టుకు ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై తులసీరాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని వంజారిగుడాకు చెందిన నాగర్‌గోజే శివా జీ (77) మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నానని కోడలికి చెప్పి బయల్దేరాడు. పొలం వద్ద చేరుకుని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు మారోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కనకరాజుకు కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు
- తరలివచ్చిన గిరిజనం



కనకరాజు మృతదేహం



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మ బొజ్జుపటేల్ తదితరులు

జైనూర్/కెరమెరి: ఆదివాసీ సంప్రదాయాల్లో ముఖ్యమైన గుస్సాడీ నృత్యానికి దేశవిదేశాల్లో పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిన పద్మశ్రీ కనకరాజుకు కన్నీటి వీడ్కోలు పలికారు. జైనూర్ మండలంలోని మర్లవాయిలో శనివారం అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనం అందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, రాజకీయ నాయకులు హాజరై పార్థివదేహానికి నివాళులర్పించారు. స్నేహితులు, శ్రేయోభిలాషులు, ఆదివాసీలు, గిరిజనులు తరలివచ్చి వీడ్కోలు పలికారు. గుస్సాడీ శిక్షణ ఇచ్చిన ఆయన ఇక లేరని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ దండారీ ఉత్సవాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన కనకరాజు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారాం, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణక్క, బీఆర్‌ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, బీజేపీ నాయకులు కోట్నక విజయ్, రితేష్ రాథోడ్, డీఎస్పీ కరుణాకర్, జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, శివ్‌శంకర్, సీఐ రమేశ్, డీఎల్‌పీవో అమీర్ హుస్సేన్, ఆదివాసీ నాయకులు అనక దేవేందర్, కొడప హన్నుపటేల్, మెస్రం అంబాజీ, కొడప ప్రకాశ్, కనక వెంకటేశ్, ముకుంద్, ఆదివాసీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలతో..

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో శనివారం అధికారులు దగ్గరుండి ఏర్పాట్లుచేశారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ప్రకారం పెద్దకుమారుడు చితికి నిప్పుపెట్టారు. కనకరాజు మృతితో గోండుపల్లెలు శోకసంద్రంలో మునిగాయి. గుస్సాడీ నృత్యాన్ని దేశానికి పరిచయం చేసిన ఆయన తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో మర్లవాయి బోరుమంది.



అంత్యక్రియల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కనకరాజు మృతి తీరనిలోటు

దండారీ ఉత్సవాలు ప్రారంభమవుతున్న వేళ పద్మశ్రీ కనకరాజు మృతి ఆదివాసీలకు తీరని లోటు. పద్మశ్రీ అవార్డు అందుకున్న ఆయనకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.కోటి అందించారు. అందులో నుంచి కనకరాజు రూ. 20 లక్షలతో గుస్సాడీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు.

– ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

గుస్సాడీ రాజుగా కీర్తి..

ఆదివాసీ కళను జాతీయ, అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లి గుస్సాడీ రాజుగా కీర్తి గడించారు. 1980లో దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సమక్షంలో కనకరాజు దండారీ నృత్యాన్ని ప్రదర్శించారు. కొన్నిరోజులుగా అస్తమాతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందగా, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆసిఫాబాద్‌లో ఆయన ఇంటి నిర్మాణం చేపడుతాం. కేబినెట్ సమావేశం ఉండటం వల్ల అంత్యక్రియలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరుకాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కనకరాజు కుటుంబానికి అండగా ఉంటుంది.

– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

గుస్సాడీ భీష్ముడిగా ప్రఖ్యాతి

దేశవ్యాప్తంగా గుస్సాడీ భీష్ముడిగా కనకరాజు ప్రఖ్యాతిగాంచారు. ఆయన మరణాన్ని ఆదివాసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. గోండు తెగకు చెందిన మొట్టమొదటి పద్మశ్రీ అవార్డు అందుకున్నది కనక రాజే. ప్రపంచానికి దండారీ ఉత్సవాలకు పరిచయం చేసిన ఈయన.. ఉత్సవాల ప్రారంభం వేళ మృతిచెందడం ఏత్మాసూర్ దేవతల పుణ్యమని భావిస్తున్నాం.

– మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఎస్సై, ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్



సోనియా

కాగజ్‌నగర్‌రూరల్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో ఓ కేసును పక్కదారి పట్టించిన అప్పటి ఎస్సై, ఏఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో అవినీతికి పాల్పడడంతో ఎస్సై సోనియా, ఏఎస్సై మను, హెడ్‌కానిస్టేబుళ్లు ఉమేశ్, రమేశ్ సస్పెండ్‌కు గురయ్యారు. ఆగస్టు 3న కాగజ్‌నగర్ మండలం బురడగూడ గ్రామానికి చెందిన కొట్రంగి శ్యాంరావు(36) ప్రమాదవశాత్తు ఇంట్లోనే మంచి మీది నుంచి కింద పడి మృతిచెందినట్లు తల్లి కొట్రంగి భీంబాయి ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయంలో మొదటి నుంచి అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో కొందరు గ్రామస్తులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన శ్యాంరావు మృతదేహానికి ఆగస్టు 16న ఆర్డీవో సురేష్, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీపోస్టుమార్టం చేశారు. కేసులో సాక్ష్యాలను తారుమారు చేయడం, అవాస్తవాలను పంచనామాలో పొందుపర్చి కేసును నిర్వీర్యం చేయడంతో అప్పటి ఎస్సై సోనియాను రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని–2టౌన్ ఎస్సైగా బదిలీ చేశారు. తాజాగా రీపోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఎస్సై, మరో ముగ్గురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

పలువురి బైండోవర్

దండేపల్లి: తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలో అ క్రమ కలప నిల్వచేసిన వారితోపాటు పలువురిని దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు డీఆర్వో పోచమల్లు, ఎఫ్ఎస్‌వో నరేశ్ తెలిపారు. బైండోవర్ అయిన వారిలో కర్ణపేటకు చెందిన ముడితే చి న్నక్క, మారినేని భూమేశ్ల ఇళ్ల వద్ద కలప ని ల్వ ఉంచడం, లింగాపూర్ బీట్ పరిధిలో పోడుసాగు కోసం అటవీ భూమిలో చెట్లపొదలు తొ లగించినందుకుగాను గడ్డం సత్తవ్వ, ముడితే సత్తవ్వ, గడిపెల్లి ఇందిర, ముడితె వనిత, తాని మడుగు బీట్‌లో చెట్లను నరికి వేసినందుకు గాను ముడితే శ్రీనివాస్, సురేందర్, చేదం రాజన్నలను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

గోదావరిలో మునిగి మత్స్యకారుడి మృతి



కిశోర్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు గూడెం గోదావరి నదిలో మునిగి మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం..మగ్గిడి కిశోర్ (35) ఈనెల 24న గూడెం గోదావరి వద్దకు చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాగా, అతను సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అతని ఆచూకీ కోసం వెతికారు. శనివారం గూడెం గోదావరి నదిలో కిశోర్ మృతదేహం లభించింది. నదిలో చేపలు వేటాడే సమయంలో ప్రమాదవశాత్తు తెప్ప బోల్తాపడి నీటిలో మునిగి చనిపోయాడని భార్య పల్లవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘ప్రాణహిత’లో ముగ్గురు గల్లంతు

- నదిలో గాలింపు చర్యలు
- రాత్రి వరకు దొరకని ఆచూకీ
- సోమిని ఎర్రబండ వద్ద ఘటన



జాహీర్ హుస్సేన్ (ఫైల్)



మోహిజ్ (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని సోమిని ఎర్రబండ ప్రాణహిత నదిలో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని గోల్కొండ వీధికి చెందిన జాహీర్ హుస్సేన్(24), మోహిజ్(19), ఎండీ ఇర్షాద్(19), అబ్దుల్ కాజీం ఖాన్ శనివారం మధ్యాహ్నం సరదా కోసం ప్రాణహిత నది వద్దకు వెళ్లారు. నదిలో దిగి స్నానం చేసి బయటకు వచ్చారు. మరోసారి జాహీర్ హుస్సేన్, మోహిజ్, ఎండీ ఇర్షాద్ స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నదిలో గల్లంతై కొట్టుకుపోతుండగా కాపాడాలని జాహీర్ హుస్సేన్ కేకలు వేశాడు. ఒడ్డుమీద ఉన్న అబ్దుల్ కాజీం ఖాన్ నది సమీపంలో అర్థనాదలు చేశాడు. ఈ విషయాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని గల్లంతైన ముగ్గురు కోసం నదిలో గాలించారు. రాత్రయిన ఆచూకీ దొరకలేదు. కౌటాల సీఐ ముత్యం రమేశ్, బెజ్జూర్ ఎస్సై విక్రమ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.



ఎండీ ఇర్షాద్ (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చిన్న సాయన్న(ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని తలువేదా ఎక్స్‌రోడ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తలువేద గ్రామానికి చెందిన బక్కోళ్ల చిన్న సాయన్న (45) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ అనంతరం ఎక్స్‌రోడ్డు వద్ద ఉండే దుకాణ యజమాని మొహమ్మద్ మునిరుద్దీన్‌తో కలిసి బైక్‌పై టీ తాగడానికి మంజులాపూర్ వెళ్లి తిరిగి వస్తున్నారు. నిర్మల్ నుంచి భైంసా వెళ్తున్న లోకేశ్వరానికి చెందిన రవి బైక్ పై అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ముందు వెళ్తున్న చిన్న సాయన్నను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన చిన్న సాయన్నను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి అటు నుంచి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికంగా వేధించిన యువకుడికి దేహశుద్ధి



చెట్టుకు కట్టేసి ఉన్న అబిద్

కాగజ్‌నగర్‌రూరల్: ఓ యువతిని లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా శుక్రవారం అర్ధరాత్రి వేళ ఇంటికి వెళ్లిన యువకుడిని కాలనీవాసులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5లో చోటుచేసుకున్న ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్‌కు చెందిన ఎండీ ఆబిద్ గత సంవత్సర క్రితం నుంచి తనను ప్రేమించాలని యువతి వెంట పడుతున్నాడు. అర్ధరాత్రి వేళ ఆమె ఉంటున్న కాలనీకి వెళ్లి పలుమార్లు ఫోన్‌చేశాడు. ఇంటి వాళ్లు చూస్తారనే భయంతో బయటకు వచ్చి అతడితో వాగ్వాదానికి దిగింది. కాలనీయువకులు అతడిని పట్టుకుని చెట్టుకు కట్టేశారు. వేకువజామున సమాచారం అందడంతో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సైలు రామన్‌కుమార్, దీకొండ రమేశ్ తదితరులు ఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడిని విడిపించే ప్రయత్నం చేశారు. అక్కడే కాలనీ యువకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఎస్సై రమేశ్ కిందపడి పోవడంతో తలకు గాయాలయ్యాయి. పోలీసులు అదనపు బలగాలను ఘటన స్థలానికి మోహరింపజేసి యువకుడిని రహస్య ప్రాంతానికి తరలించారు. అయినప్పటికీ యువకులంతా కలిసి ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు సముదాయించడంతో శాంతించారు.

వాంతులు, విరేచనాలతో ఆశ్రమ విద్యార్థిని మృతి

- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆదివాసీల ఆందోళన



రాతపూర్వక హామీ పత్రం ఇస్తున్న అధికారులు



మడావి గంగోత్రి (ఫైల్)

ఇంద్రవెల్లి: వాంతులు, విరేచనాలతో ఆశ్రమ విద్యార్థిని మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, తోటి విద్యార్థినులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన మాడవి కృష్ణ–జంగుబాయి దంపతుల రెండో కుతూరు గంగోత్రి(15). ఇంద్రవెల్లి ఆశ్రమ బాలికల వసతి గృహంలో తొమ్మిదో తరగతి చదువుతుంది. దసరా సెలవుల అనంతరం ఈ నెల 21న పాఠశాలకు వచ్చింది. రెండు రోజులుగా నెలసరి రావడంతో పాటు స్వల్ప అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున వాంతులు, విరేచనాలు చేసుకుని స్పృహ కోల్పోయింది. వెంటనే ఏఎన్ఎం విజయ సిబ్బంది సహకారంతో ఆటోలో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యసిబ్బంది పరీక్షల అనంతరం అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించా రు. అయితే అప్పటికే మృతి చెందినట్లు రిమ్స్ వైద్యులు ని ర్ధారించారు. కాగా సిబ్బంది ని ర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని వసతిగృహంలోనే మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

విద్యార్థిని మృతి సమాచారంతో ఆదివాసీ సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు వేరే మార్గం ద్వారా మృతదేహాన్ని వాల్గొండ గ్రామానికి తరలిస్తుండగా అంబులెన్స్‌ను ఆందోళనకారులు అడ్డుకున్నారు. మండలకేంద్రానికి తీసుకొస్తుండగా ఉట్నూర్ సీఐ మొగిలి వెంటనే వడగామ్‌కు చేరుకొని వారితో చర్చించారు. బాధిత కుటుంబీకులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో క్రాంతి, సీఐ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఈఎస్ఎస్ కింద రూ.2లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని రాతపూర్వక హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. మృతదేహాన్ని వాల్గొండకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

కిడ్నీలో 64 రాళ్ల తొలగింపు



శస్త్రచికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది

ఎదులాపురం: కిడ్నీలో రాళ్లతో ఏడాదిగా బాధపడుతున్న బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన రమేశ్‌కు శనివారం రిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేశారు. 64 రాళ్లను తొలగించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సకు రూ.2 లక్షల ఖర్చవుతుందని, రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స చేసినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. యూరాలజీ వైద్య నిపుణుడు కార్తీక్ ఆధ్వర్యంలో ‘కీ హోల్’శస్త్రచికిత్స పద్ధతిని ఉపయోగించి కిడ్నీలోని రాళ్లను తొలగించారని పేర్కొన్నారు.

వివాదాస్పదంగా బ్రిడ్జి నిర్మాణం



పెద్దనపల్లి శివారు వాగుపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జి

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి పంచాయతీ శివారు వాగుపై బ్రిడ్జి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇటీవల చేపట్టిన ప్రార్థన కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారని శాశ్వత బ్రిడ్జిని నిర్మించారు. వాగును ఆక్రమించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంపై బీజేపీ నాయకులు, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం బెల్లంపల్లి ఆర్డీవో ఈ సమస్యను విన్నవించారు. దీంతో గతంలో ఉన్న వాగులు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ డీఈ నారాయణను సంప్రదించగా బ్రిడ్జి నిర్మాణంపై నోటీసులు అందజేశామని, మిగతా నిర్మాణాలపై అధికారులను విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

ఇంటి విద్యుత్ బిల్లు రూ.1.47లక్షలు

- కంగుతిన్న వినియోగదారుడు
- ఎనిమిదేళ్ల బిల్లు ఒక్కసారే
- న్యాయం చేయాలని చెన్నూర్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన



బైఠాయించి నిరసన తెలుపుతున్న సంపత్‌గౌడ్



సంపత్‌గౌడ్ ఇంటికి వచ్చిన విద్యుత్ బిల్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన గట్టు సంపత్‌గౌడ్ ఇంటి విద్యుత్ బిల్లు రూ.1.47 లక్షలు రావడంతో కంగుతిన్నాడు. ఎనిమిదేళ్ల బిల్లు ఒకేసారి వచ్చిందని వాపోయాడు. అధికారుల తప్పిదంతోనే ఇంత బిల్లు వచ్చిందని, తనకు న్యాయం చేయాలని శనివారం చెన్నూర్‌లోని సబ్‌స్టేషన్ ఎదుట పలువురితో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. 2016లో రూ.1800లతో తన పేరిట డీడీ తీసి విద్యుత్ మీటరుకు దరఖాస్తు చేస్తే అమర్చారు. నాలుగు నెలలకు బిల్లులు రాకపోవడంతో లైన్‌మెన్‌ను అడుగగా ఇంకా ఆన్‌లైన్‌లో ఎక్కలేదని చెప్పాడు. ఏడాది గడిచినా విద్యుత్ బిల్లు రాలేదు. 2024 మే నెలలో గ్రామంలో పర్యటించిన విజిలెన్స్ అధికారులను కలిసి మొర పెట్టుకున్నాడు. తర్వాత చెన్నూర్‌లో ఏడీఈకి ఫిర్యాదు చేశాడు. జూన్‌లో మీటరు నంబరు వచ్చినట్లు జూలైలో విద్యుత్ బిల్లు కొట్టగా రూ.1,47,222 లక్షలు వచ్చినట్లు బాధితుడు వాపోయాడు. అప్పటి నుంచి విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న తనను విద్యుత్ బిల్లు చెల్లించాలని అధికారులు అంటున్నారని వాపోయాడు. విద్యుత్ మీటరు అమర్చి 8 ఏళ్లు గడిచినా నంబర్ ఇవ్వకపోవడం, ఆన్‌లైన్‌లో ఎక్కించకపోవడంతో ఇంత బిల్లు వచ్చిందని తెలిపాడు. ఈవిషయమై కొమ్మెర ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా సంపత్ గౌడ్ డీడీ చెల్లిస్తే ఇంటి విద్యుత్ మీటరు రీ చెకింగ్‌కు పంపుతామన్నారు. వచ్చిన బిల్లులో వినియోగదారుడు కొంత చెల్లించాల్సి ఉంటుందన్నారు. మీటర్ చెకింగ్ అనంతరం మళ్లీ బిల్లు కొడితే అప్పుడు వచ్చిన బిల్లును చెల్లించాలని పేర్కొన్నారు.

తానిమడుగు బీట్‌లో టేకుచెట్ల నరికివేత

- విచారణ చేపట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం



నరివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీరేంజ్ పరిధిలోని తానిమడుగు అటవీ బీట్‌లో సుమారు 24 టేకు చెట్లను స్మగ్లర్లు నరికివేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. టేకు చెట్లను గొడ్డళ్లతో నరికి రంపాలతో కోసి, విలువైన వృక్షాలను నేలవాల్చినట్లు సమాచారం. రేంజ్ పరిధిలో అక్రమ కలప దందా జోరుగా సాగడంతో ఇదివరకే ఇద్దరు అటవీ అధికారులు సస్పెండ్ అయ్యారు. అయినా ఇంకా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదు. ఈవిషయమై మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో రమాదేవిని వివరణ కోరగా, చెట్లు నరికి వేసిన విషయం వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నివేదిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారులో శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. కడెం నుంచి పని ముగించుకొని బైక్‌పై వస్తున్న పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గట్ల పెంటయ్యను ఖానాపూర్ నుంచి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన పెంటయ్యను ఖానాపూర్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు తరలించారు. భార్య సత్తవ్వ ఫిర్యాదుతో డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జోహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!


విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు


సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజ్‌లో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.**

వికెట్ల పతనం: 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

సినిమా


● రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

- దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘అమరన్’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్ గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యాభైఏళ్ల రాజీనామా


● చిరంజీవి
Mr. K. S. S. V. Prasada Rao, II B. Com.,
Best actor of the college 1974–75.

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సాపూర్‌లోని వైఎన్‌ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

- కిరణ్ అబ్బవరం


● నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

‘క’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ


● విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురీందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

- దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెట్టిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

– ఇంటూరు హరికృష్ణ